సాక్షి
సంగారెడ్డి
సోమవారం, 12, జూన్, 2023



తాగునీటి ఎద్దడికి నివారణకు..
తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం బృహత్తర ప్రణాళికలో భాగంగా మంజీరా, గోదావరి జలాల అనుసంధానానికి శివ్వంపేటలో భారీ సంపు నిర్మాణం చేపట్టారు. 8లో



ముగిసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్
నోరూరించే చేపల, రొయ్యలతో తయారు చేసిన వంటకాలు..కుటుంబంతో కలిసి ఆరగించేందుకు వచ్చిన పట్టణవాసులతో కోమటిచెరువు తీరం కళకళలాడింది. 8లో



ఆటస్థలాలు ఇలా.. ఆడుకునేదెలా? 9లో
గ్రామీణ యువత, పిల్లలు ఆటలు ఆడుకునేందుకు వీలుగా తెలంగాణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించింది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గ్రూప్‌-1 పరీక్ష

- పటాన్‌చెరు పరిధిలో ఎనిమిది కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- 2832 మందికి 1173 మంది గైర్హాజరు



హాల్ టికెట్ తనిఖీ చేసి కేంద్రంలోకి పంపుతున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలో గ్రూప్‌-1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గ్రూప్‌-1 పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8.30 గంటల నుంచి అభ్యర్థులతో రద్దీ నెలకొంది. పరీక్ష రాయడానికి వచ్చిన వారిని సిబ్బంది తనిఖీలు చేసి కేంద్రంలోకి అనుమతించారు. మొత్తం ఎనిమిది కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొత్తం 2832 మందికిగాను 1659 హాజరయ్యారు. 1173 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వచ్చినప్పటికీ ఒరిజినల్ ఐడీ ప్రూఫ్ తీసుకు రాకపోవడంతో వారు వెనుదిరగాల్సి వచ్చింది. అలాగే పటాన్‌చెరు సెయింట్ జోసెఫ్ స్కూల్ వద్ద ఓ అభ్యర్థిని పది నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారుల పరీక్ష కేంద్రానికి అనుమతించలేదు. కేంద్రాల వద్ద పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి, సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహించారు.

సీపీఐ ప్రజాగర్జనకు తరలిన నాయకులు



సీపీఐ ప్రజాగర్జనకు తరలివెళ్తున్న సీపీఐ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో జరుగుతున్న సీపీఐ ప్రజాగర్జనకు ఆదివారం సంగారెడ్డి నుంచి నాయకులు భారీగా తరలివెళ్లారు. సంగారెడ్డిలో సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల్ని గాలికొదిలి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. వందేళ్ల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో నోట్ల రద్దు మొదలుకొని జీఎస్టీ, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ప్రభుత్వాల తీరు మారకుంటూ తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉచితంగా ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు



దరఖాస్తు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): కులవృత్తుల వారి అభ్యున్నతికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.లక్ష ఆర్థిక సహాయం పథకాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీసంగమేశ్వర్ కమ్యూనికేషన్‌లో ఉచిత దరఖాస్తు చేసుకునే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ మండల పరిధిలోని కుల వృత్తిదారులు ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీలమల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల విరేశం, కౌన్సిలర్లు శ్రీనివాస్ నాయక్, విద్యాసాగర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ కోదూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు మొబిన్, నసీర్, సతాని శ్రీశైలం, వాదోని రాజు, అయూబ్‌ఖురేషి, జైన్‌రాజు, నాని, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నలుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని టెస్టులు చేసిన నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. కాగా ఆర్టీపీసీఆర్ టెస్టులు చేయలేదన్నారు.

ఆర్పీల దారుణం

- పొదుపు సంఘాలను చిదిమేస్తున్న వైనం
- రుణం మంజూరుకు పర్సంటేజీల డిమాండ్
- ఎవరికీ చెప్పుకోలేని స్థితిలో సంఘాల మహిళలు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు



మహిళ సంఘం సమావేశం (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొదుపు సంఘాలు నేడు ఆర్పీల కారణంగా మనుగడ సాగించలేకపోతున్నాయి. ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతూ వారు ఒకరిపై ఆధారపడ ఉండకుండా ఉండాలని, ఆర్థికంగా ఎదగాలనే చూస్తుంటే, ప్రవేశపెట్టిన పథకాలు ఆర్పీలకు వరాలుగా మారాయి. అడిగినంత ఇస్తేనే రుణం మంజూరు లేకుంటే ఎందుకు ఇవ్వాలన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మహిళలు వాపోతున్నారు.

- పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం రుణాలు ఇస్తుంటే దళారుల్లా ఈ ఆర్పీలు పొదుపు సంఘాల మహిళలకు చేరకుండా అడ్డుకుంటున్నారు.
- ప్రభుత్వం మహిళా సంక్షేమం కోరుతూ ఈ ఆర్పీలను నియమించారు. మీరు మాత్రం మహిళా సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి దళారుల్లా వ్యవహరిస్తున్న ఆర్పీలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

రాజకీయ పార్టీ సమావేశాలకు..

- పొదుపు సంఘాల మహిళలకు రుణాలు ఇప్పిస్తూ, వారి నుంచి రూ.5 నుంచి 6 వేలు వసూలు చేస్తున్నారని మహిళా సంఘం సభ్యులు సాక్షికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు.
- తాను రుణం మంజూరు కోసం రూ.6 వేలు చెల్లించినట్లు ఓ సభ్యురాలు తన గోడు సాక్షికి చెప్పుకుంది. ఆర్పీలు పార్టీలకతీతంగా వ్యవహరించాలన్న నిబంధన ఉన్నా ఒక్కో ఆర్పీ ఒక్కో పార్టీకి మద్దతు ఇస్తున్నారని, వారు పిలిచినప్పుడు పార్టీల సమావేశాలకు వెళ్లాలని పటాన్‌చెరు సర్కిల్‌-22 లో, మండలాల్లో, మున్సిపాలిటీలో ఇదే పరిస్థితి నెలకొందని వాపోయింది.

సంఘాల వివరాలు...

- పటాన్‌చెరు మండలంలో 1312, అమీనాపూర్ మండలంలో 227, జిన్నారం మండలంలో 513, గుమ్మడిదల మండలంలో 661 సంఘాలు ఉన్నాయి.
- జీహెచ్ఎంసీ సర్కిల్‌- 22లో మూడు డివిజన్లలో 1,431, అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీలు కలిపి మొత్తం 1,050, పటాన్‌చెరు నియోజకవర్గంలో మొత్తం 5,194 మహిళా సంఘాలు ఉన్నాయి.
- అలాగే ఆర్పీలు సర్కిల్‌-22లో మూడు డివిజన్లలో కలిపి 58 మంది, పటాన్‌చెరు మండల పరిధిలో 44 మంది, అమీన్ పూర్ మండలంలో 8 మంది, గుమ్మడిదల మండలం 22 మంది, జిన్నారం మండలంలో 19 మంది ఉన్నారు.
- మున్సిపాలిటీలైన అమీన్‌పూర్‌లో 22 మంది, బొల్లారంలో 8 మంది, తెల్లాపూర్‌లో 14 మంది ఉన్నారు.

> **వసూలు చేస్తే కఠిన చర్యలు**
>
> మహిళా సంఘాల నుంచి ఆర్పీలు డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆర్పీలు, సీఓల ద్వారా రుణాలకు సంబంధించిన పత్రాలు బ్యాంకుకు వెళ్తాయి. ఇప్పటి వరకు డబ్బులు వసూలు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. ఈ విషయంపై విచారణ జరిపిస్తా. ఆర్పీలు డబ్బుల వసూలకు పాల్పడి ఉంటే చర్యలు తీసుకుంటా.
>
> - పుణ్యవతి, జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ మేనేజర్

ముగిసిన గ్రూప్‌- 1 ప్రిలిమినరీ పరీక్ష

- 62.35 శాతం మంది హాజరు
- కలెక్టర్ డాక్టర్ శరత్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో టీఎస్పీఎస్సీ గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. ఆదివారం సంగారెడ్డి, సదాశివపేట పట్టణంలో పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అభ్యర్థులు, సిబ్బంది హాజరు వివరాలపై ఆయా కేంద్రాలలో ఆరా తీశారు. పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో కలియ తిరిగారు. పరీక్షకు మొత్తం 8,654 మంది హాజరు కావలసి ఉండగా, 5396 మంది అభ్యర్థులు హాజరయ్యారని, 3258 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. 62.35 శాతం హాజరు నమోదైందన్నారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీ కాలేజీ వద్ద కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన ఐదుగురుని లోపలికి అనుమతించలేదు. కలెక్టర్ వెంట సంబంధిత పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్, లైజనింగ్ అధికారులు, తహసీల్దార్ ఉన్నారు. కాగా అదనపు కలెక్టర్ వీరారెడ్డి పటాన్ చెరు మండలం రుద్రారం గీతం కళాశాల, పటాన్‌చెరులోని శిశువిహార్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన కేంద్రాలను సందర్శించారు. ఆయన వెంట డీపీఓ సురేష్ మోహన్, ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్ ఉన్నారు.

తెలంగాణ రన్ విజయవంతం చేయాలి

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12వ తేదీన తెలంగాణ రన్ కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదివారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉదయం 6 గంటలకు ఎస్పీ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు రన్ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, యువత, యువజన సంఘాలు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ జన్మదిన వేడుకలు



పండ్లు పంచిపెడుతున్న కాలనీ వాసులు

పటాన్‌చెరు: తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త జన్మదిన వేడుకలు అమీన్‌పూర్ అవోపనగర్ కాలనీ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగాయి. అమీన్‌పూర్‌లోని పేదలకు పండ్లు, మజ్జిగ, కేకులను పంచి పెట్టారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బెల్లి శ్రీధర్, కోటేశ్వర్‌రావు, పుల్లారావు, హరినాథ్, భక్తవత్సలం, వై.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపుపై ఆగ్రహం



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం

కొండాపూర్(సంగారెడ్డి): జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామపంచాయతీ పరిధి అల్లీనగర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించడాని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) తీవ్రంగా ఖండిస్తోందని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం అన్నారు. ఆదివారం సంగారెడ్డిలోని కేవీపీఎస్ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అల్లీనగర్ గ్రామంలో గ్రామ కంఠం భూమి సాకుతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన గ్రామపంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని, అతడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని గ్రామకంఠం స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండానే పరిశ్రమను ఏర్పాటు ప్రయత్నిస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గ్రామకంఠం, ప్రభుత్వ భూమి ఏదైనా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలులేదని చట్టం చెబుతున్నా రెవెన్యూ అధికారులు కబ్జాకోరులకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ భూములను వారికి కట్టబెడుతున్నారని ఆరోపించారు. అల్లీనగర్ గ్రామంలో కాలుష్య పరిశ్రమ ఏర్పాటును అడ్డుకోవాలని, ఆ భూములను గ్రామంలోని నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఎక్కడైతే తొలగించారో తిరిగి అక్కడే ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరు శివకుమార్, కొర్మోని సుభాష్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఏర్పాటులో కవుల పాత్ర కీలకం

జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కవులు, సాహిత్యపరులు, కళాకారుల పాత్ర కీలక పాత్ర పోషించారని జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా నలుమూలల నుంచి కవులు, కవయిత్రులు, సాహితీవేత్తలు భారీగా తరలివచ్చారు. తమ కవితలతో తెలంగాణ ఔన్నత్యాన్ని, ప్రగతిని చాటి చెప్పారు. తెలంగాణ వచ్చాక ప్రజల జీవితాల్లో వచ్చిన వెలుగులను, ప్రగతి పథంలో దూసుకెళ్తున్న తీరును, అమలవుతున్న సంక్షేమ సౌరభాలను, మారిన తెలంగాణ ముఖచిత్రాన్ని తమ కవితలలో వినిపించారు. ముందుగా 17వ శతాబ్దికి చెందిన సంగారెడ్డి జిల్లా కవి పొన్నగంటి తెలగన చిత్రపటానికి జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, కలెక్టర్ శరత్, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పోరాట ఉద్యమంలో సాహిత్యపరుల పాత్ర అమోఘమన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కవులు తమ కవిత్వంతో సమాజాన్ని జాగృతం చేస్తారన్నారు. వారి కవితలు, రచనలు, పాటల ద్వారా సమాజంలో చైతన్యాన్ని తీసుకువచ్చారని, తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించారన్నారు. కవి సమ్మేళనంలో 62 మంది కవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్‌ఓ నగేష్, డీఈఓ వెంకటేశ్వర్లు, డీపీఓ గోవిందరామ్, యువజన సంక్షేమ అధికారి రామచందర్ రావు, డీసీఓ తుమ్మ ప్రసాద్, జిల్లా డెయిరీ అధికారి మురళి, జిల్లా సైన్స్ అధికారి విజయ్ కుమార్, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, పీఎంకే గాంధీ, మహిపాల్ రెడ్డి, కవులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సామాజిక సేవలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం పెరగాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి భారతినగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్‌సొసైటీ కాలనీలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికసేవలో ఉండే ఆనందం ఎందులోనూ ఉండదన్నారు. సమాజం మాకు ఏమి ఇస్తుందని ఆలోచించకుండా సమాజానికి నేను ఏమి చేస్తున్నాను అన్న సమున్నత లక్ష్యంతో యువత ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు సింధు ఆదర్శ్‌రెడ్డి, పుష్పనగేష్, సీఐ నరేందర్‌రెడ్డి, నాయకులు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి

అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఓడీఎఫ్ కాలనీ, సాయి భగవాన్ కాలనీలలో రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సాయికృపా కాలనీలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగు కాల్వల నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అలాగే ఇంటింటికి రక్షిత మంచినీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు బిజిలి రాజు, అనిరుద్ రెడ్డి, కృష్ణ, నవనీత జగదీశ్, చంద్రకళ గోపాల్, రాములు, బాలమణి బాలరాజు, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు



సంగారెడ్డి అర్బన్: పట్టణంలోని పాత బైపాస్ ఇరుకుగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్కాపూర్ చింతల్ నుంచి రాజంపేట చౌరస్తా వరకు ఇళ్లు నిర్మించారు. దీంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా రోడ్డంతా గుంతలమయంగా మారడంతో వర్షాకాలంలో నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోందని చెబుతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్లపై మురుగు పారుతూ దుర్వాసన వెదజల్లుతోందన్నారు. రోడ్డు వెడల్పు చేసి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని కోరుతున్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

జహీరాబాద్ టౌన్: విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, ప్రతిఒక్కరికీ చదువుతో పాటు సంస్కారం అవసరమని రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్ అన్నారు. మండలంలోని సత్వార్‌కు చెందిన అన్వీర్ కుమారుడు సాయిచరణ్ పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించగా ఆదివారం దత్తగిరి కాలనీలోని బసవ మండపంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్‌పాటిల్ మాట్లాడుతూ సాయిచరణ్ భవిష్యత్‌లో చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ జహీరాబాద్ నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు బసవ మండపంలో ప్రార్థనలు నిర్వహించారు.



సాయిచరణ్‌ను సన్మానిస్తున్న శంకర్‌పాటిల్, నాయకులు

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

- ప్రధాన మురుగు కాల్వలపై దుకాణ సముదాయాలు
- నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు
- చర్యలు చేపట్టిన మున్సిపల్ అధికారులు



కాల్వలపై ఏర్పాటు చేసిన ర్యాంపులను తొలగిస్తున్న సిబ్బంది

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. సంగారెడ్డి పాత బస్టాండ్ నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు కబ్జా చేస్తున్నారు. అలాగే బైపాస్‌లోఉన్న ఫుట్‌పాత్‌లపై దుకాణం సముదాయాలు ఏర్పాటుచేస్తున్నారు. వీటిని చిరు వ్యాపారస్తులకు అద్దెకు ఇస్తున్నారు. దీంతో పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు, పాదచారులు నానా అవస్థలుపడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం కురిస్తే పూడిక కారణంగా పారుదల లేక మురుగు ప్రధాన రహదారులపై ఏరులై పారుతోంది.

చెత్తా చెదారం నిండి..

ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం మురుగు కాల్వల్లో వేస్తుండటంతో మురుగు పారుదల నిలిచిపోతోంది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా రోడ్లపై పారుతుండటంతో రాకపోకలు సాగించే వారు నానా అవస్థలుపడుతున్నారు. అధికారులు స్పందించి పుట్‌పాత్‌లపై ఏర్పాటుచేసిన దుకాణ సముదాయాలు, రాంపులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న వర్తక సముదాయ ఆక్రమణలు కూల్చివేశారు. ఫుట్‌పాత్‌లపై దుకాణాలు, నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ హెచ్చరించారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధం



దగ్ధమైన గడ్డివాము, మోటార్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): పలుచోట్ల ప్రమాదవశాత్తు అంటుకుంటున్న కార్చిచ్చులు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నాయి. నిమిషాల వ్యవధిలోనే గడ్డివాములు, మోటార్లు కాలి బూడిదవుతున్నాయి. మండలంలోని కట్కూరు పరిధిలోని చాపగాని తండాకు చెందిన గిరిజన రైతు గుగులోతు రాజన్నకు చెందిన 5 ఎకరాల్లో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాముతో పాటు మూడు మోటార్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతు రాజయ్య తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. నిప్పు ఎలా అంటుకుందో తెలియదని, ఎవరైనా దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

పిడుగుపాటుతో పాడిగేదె మృతి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం రాములపల్లి గ్రామానికి చెందిన దుబ్బాక రవిశంకర్‌కు చెందిన పాడిగేదె శనివారం రాత్రి కురిసిన వర్షంలో పిడుగుపాటుకు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. పాల ఉత్పత్తిని ఎంచుకొని జీవనం సాగిస్తున్న కుటుంబానికి పాడి పశువు మరణించిండంతో రూ.70 వేల ఆర్థిక నష్టం జరిగింది. ప్రభుత్వం పేద కుటుంబానికి ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని సర్పంచ్ గంగం మధు కోరారు.

పేకాట స్థావరంపై దాడి..

దుబ్బాకరూరల్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసిన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. గ్రామ శివారులోని చెరువు కట్ట గంగమ్మ గుడి వద్ద ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి వద్ద నుంచి ఐదు మొబైల్ ఫోన్లు, రూ.7410లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణ శివారులో ఓ వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం పోలీసులు గుర్తించారు. వివరాలు ఇలా ఉన్నాయి..జహీరాబాద్ పట్టణం నుంచి అల్గోల్ వెళ్లే దారిలో గల వ్యవసాయ బావిలో గుర్తుతెలియని శవం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమచారం ఇచ్చారు. ఎస్‌ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని మున్సిపల్ సిబ్బంది సహాయంతో శవాన్ని బయటకు తీశారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గుండెపోటుతో ఇద్దరి మృతి



సయ్యద్ హాసన్ (ఫైల్)

తూప్రాన్: పట్టణానికి చెందిన మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ హకాని (52)గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. స్నేహితులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన హాసన్ మెకానిక్‌గా కొనసాగుతున్నాడు. రెండు రోజుల క్రితం తన సోదరుడి కూతురు వివాహం జరిగింది. విందుకు హాజరయ్యేందుకు కుటుంబ సభ్యులతో కలిసి బయలు దేరేందుకు సిద్ధం కాగా ఒక్కసారిగా హాసన్ ఛాతిలో నొప్పితో కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.



సుధాకర్ (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): గుండెపోటుతో రైతు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని బండపోసాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఎర్ర సుధాకర్(35) ఆదివారం ఉదయం ఇంట్లో ఉండగా ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పేలోపే ఒక్కసారిగా కుప్పకూలాడు. దీన్ని గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటినా మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 6K ఫోన్ : 9640258899 [H-793440]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాగునీటి ఎద్దడికి నివారణ చర్యలు

- రెండు నదుల అనుసంధానంతో గోదావరి జలాల నిల్వ
- శివ్వంపేట సంపు నిర్మాణం ప్రారంభించడంలో ఆలస్యం



శివ్వంపేటలో నిర్మించిన సంపు

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం బృహత్తర ప్రణాళికలో భాగంగా మంజీరా, గోదావరి జలాల అనుసంధానానికి శివ్వంపేటలో భారీ సంపు నిర్మాణం చేపట్టారు. మంజీరా, గోదావరి రెండు నదుల నీరు ఇక్కడ నిల్వ చేసి గ్రామాలకు సరఫర చేసే విధంగా పనులు చేపట్టారు. తాగునీటి ఇబ్బందులను శాశ్వతంగా నివారించేందుకు 2019లో పనులు ప్రారంభించి 2022లో పూర్తి చేశారు.

రూ.30 కోట్లతో పనులు:

మంజీరా, గోదావరి నీటి నిల్వకు శివ్వంపేట అనువైన ప్రాంతంగా గుర్తించి ఇక్కడ సంపు నిర్మాణం, పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.30 కోట్లు కేటాయించింది. అందుకు గాను సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కోమటిబండ నుంచి శివ్వంపేటకు 600 ఎంఎం దయ పైపులు వేశారు. 800లక్షల లీటర్ల కెపాసిటీ గల సంపు నిర్మాణాన్ని పూర్తి చేశారు. చిన్నగొట్టిముక్లలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుకు ఇక్కడి సంపు నుంచి నీరు పంపింగ్ చేసేందుకు 100హెచ్‌పీ మోటర్లు మూడు, 60 హెచ్‌పీ మోటర్లు 3 ఏర్పాటు చేశారు.

రెండు నదులతో నీటి అనుసంధానం...

మంజీరా, గోదావరి నదుల నీటిని అనుసంధించడానికి పనులు చేపట్టారు. గోదావరి నీటి కోసం సిద్దిపేట జిల్లా కోమటిబండ నుంచి పైప్‌లైన్, మంజీరా నీటి కోసం సంగారెడ్డి జిల్లా బోరపట్ల నుంచి పైప్‌లైన్ పూర్తి చేశారు. నీటి లభ్యత ఎక్కడ ఉంటే అక్కడి నదుల నుంచి తాగునీటి కోసం పనులు చేపట్టారు.

మంత్రి కోసం ఎదురుచూపులు:

మంత్రి హరీశ్‌రావ్ సంపుని ప్రారంభించాలని మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎదురుచూస్తున్నారు. అధికారికంగా సంపు ప్రారంభిస్తే మండల ప్రజలకు మిషన్ భగీరథ తాగునీరు అందనుంది.

తాత్కాలికంగా ఉపయోగిస్తున్నాం



వేసవిని దృష్టిలో పెట్టుకుని శివ్వంపేటలో నిర్మించిన సంపుని తాత్కాలికంగా ఉపయోగిస్తున్నాం. మంజీరా నీరు నిల్వ చేసి మోటర్ల ద్వారా పలు గ్రామాలకు సరఫరా చేస్తున్నాం.

–ప్రవీణ్, డీఈ, మిషన్ భగీరథ

త్వరలో ప్రారంభిస్తాం



తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు శివ్వంపేటలో నిర్మించిన సంపుని త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తెస్తాం. మంత్రి హరీశ్‌రావ్ ద్వారా సంపు ప్రారంభానికి చర్యలు తీసుకుంటా. సంపు నిర్మాణంతో తాగునీటి నివారణకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– మదన్‌రెడ్డి, ఎమ్మెల్యే



కుంట వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

కుంటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

దుబ్బాకరూరల్: మండలంలోని బల్వంతాపూర్ గ్రామంలో బూరుగు కుంటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు కుంట వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామ శివారులోని బూరుగు కుంటను దాని చుట్టూ పక్క వ్యవసాయం చేస్తున్న రైతులు కుంట అంచున మట్టిని పోసి అందులోకి చొచ్చుకొని వచ్చి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. గతంలో నుంచి ఇదే కుంటలో గ్రామస్తులంతా బతుకమ్మలను, వినాయకులను నిమజ్జనం చేయడంతో పాటుగా కుంటను ఊరుకు దైవంగా భావిస్తారు. కుంట అంచున మట్టిని పోసి నామరూపాలు లేకుండా చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్‌కు తెలిపారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న వ్యాన్

డ్రైవర్ మృతి.. మరొకరికి గాయాలు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ – మెదక్ జాతీయ రహదారిలోని రెడ్డిపల్లి వద్ద ఆదివారం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఓమిని వ్యాన్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పాపన్నపేట మండలం అన్నారానికి చెందిన ఎండి ఇస్మాయిల్, ఎండి ఖదీర్‌లు కుటుంబ సభ్యులతో కలిసి ఓమిని వ్యాన్‌లో హైదరాబాద్ వెళ్తుండగా రెడ్డిపల్లి వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. దీంతో వ్యాన్ నడుపుతున్న ఎండి ఇస్మాయిల్, పక్కనే కూర్చున్న ఖదీర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న ముగ్గురు మహిళలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. తీవ్రగాయలైన ఇస్మాయిల్, ఖదీర్లను అటుగా వెళ్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్ 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా డ్రైవర్ ఎండి ఇస్మాయిల్ హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు.



తీవ్రగాయాల పాలైన వారిని బయటకు తీస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

జిన్నారం(పటాన్‌చెరు): గుర్తు తెలియని వాహనం వృద్ధుడిని ఢీకొట్టిన సంఘటన ఆదివారం గుమ్మడిదల గ్రామ పరిధిలోని టోల్‌గేట్ సమీపంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గాయపడిన వృద్ధుడి వయస్సు సుమారు 60 ఏళ్లు ఉంటుందని, ఎవరికైనా వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు. గాయపడిన వృద్ధుడిని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందిస్తునట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

మెదక్ మున్సిపాలిటీ: వయోభారంతో జీవితంపై విరక్తి చెంది వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ పట్టణ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ జగన్నాథం తెలిపిన వివరాల ప్రకారం..బాలిశెట్టి రామవ్వ(65) భర్త సత్తయ్య గతంలో మృతిచెందాడు. వారికి పిల్లలు లేరు. ఇంట్లో ఒంటరిగా ఉండడంతో వయోభారంతో జీవితంపై విరక్తి చెంది ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడంలేదని..

తూప్రాన్: భార్య కాపురానికి రావడంలేదని భర్త పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ యాదగిరిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నల్గొండ జిల్లా పానగల్ గ్రామానికి చెందిన శైలం మహేశ్(28) అనే వ్యక్తి భార్య ఏసమ్మతో కలిసి కరీంనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో కుల పెద్దలు పంచాయితీ పెట్టి నచ్చజెప్పారు. అక్కడి నుంచి ఈ నెల 7న తూప్రాన్‌కు వచ్చారు. భార్య ఏసమ్మ కుటుంబ సభ్యులు అదే రోజు తన పుట్టినిల్లు వరంగల్‌కు తీసుకెళ్లినట్లు చెప్పారు. దీంతో పలుమార్లు భర్త భార్యకు ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మనస్థాపానికి గురై పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

అప్పుల బాధతో వీఆర్‌ఏ..



సత్తయ్య(ఫైల్)

దుబ్బాకరూరల్: అప్పుల బాధతో వీఆర్‌ఏ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని రామక్కపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోత్కు సత్తయ్య(45) వ్యవసాయం, కూలి పనులు చేస్తూ కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల వీఆర్‌ఏగా నియమితుడైన సత్తయ్య గతంలో ఇద్దరు పిల్లల పెళ్లిళ్లు చేసి అప్పుల పాలయ్యాడు. మరో కూతురు వివాహం ఎలా చేయాలో తెలియక, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మదనపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో ఆదివారం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టు ప్రక్కల వారు గమనించి కుటుంబీకులకు, పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీస్‌లు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రీశైలంలో ముదిమాణిక్యం మహిళ మృతి



లక్ష్మీ మృతదేహం

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన మహిళ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం పాతాళ గంగలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలు లక్ష్మి(55) మూత్రపిండాల వ్యాధితో బాధపడుతోంది. ఈనెల 5వ తేదీన డయాలసిస్ కోసమని ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలిస్తున్నారు. ఆదివారం ఉదయం శ్రీశైలం పాతాళగంగలో ఓ మహిళ మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. ఆమె పర్సులోఉన్న సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా శ్రీశైలం పోలీసులు ఫోన్ చేయగా లక్ష్మి కుటుంబ సభ్యులు మాట్లాడారు. లక్ష్మీ ఫొటోలను పోలీసులు పంపాగా ఆమెను లక్ష్మిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతదేహాన్ని తేవడానికి శ్రీశైలం బయలుదేరారు.

చికిత్స పొందుతున్న ప్లాంట్ ఇన్‌చార్జి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న ప్లాంట్ ఇన్‌చార్జి మృతి చెందాడు. ఆదివారం బీడీఎల్ సీఐ వినాయక్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో ఆర్‌వి ఇంజినీరింగ్ పరిశ్రమంలో భారీ పేలుడు సంభవించడంతో అక్కడ పనిచేస్తున్న ప్లాంట్ ఇన్‌చార్జి రమణారెడ్డి, కార్మికుడు సతీష్, మరో వ్యక్తి వెంకటేశ్వర్ తీవ్రంగా, కార్మికుడు విజయ్ సింగ్ స్వల్పంగా గాయపడిన విషయం తెలిసిందే. కాగా తీవ్రంగా గాయపడినవారిని ధ్రువ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిలో బీరంగూడ కు చెందిన ప్లాంట్ ఇన్‌చార్జి రమణారెడ్డి ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. చికిత్స పొందుతున్న మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



తిరుపతి(ఫైల్)

తొగుట(దుబ్బాక): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి వలలో చిక్కుకొని మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని కాన్గల్ గ్రామంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబీకుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కాముని తిరుపతి (38) భార్య కనకలక్ష్మీ, కుమార్తె గాయత్రి, కుమారుడు గణేష్ ఉన్నారు. కూతురు తొగుట కస్తూర్బా గాంధీ పాఠశాలలో 8వ తరగతి, కుమారుడు గణేష్ దౌల్తాబాద్ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. మృగశిర సందర్భంగా చేపలు తేవాలని పిల్లలు కోరడంతో తిరుపతి శనివారం చేపల వేటకు వెళ్లాడు. అర్ధరాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన అతడి తమ్ముడు శ్రీనివాస్ ఆదివారం చెరువు వద్ద వెళ్లి చూడగా శవమై కనిపించాడు. ఎస్‌ఐ కర్ణాకర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కనకలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అడవిపంది ఢీ కొనడంతో..

కానిస్టేబుల్‌కు గాయాలు

వెల్దుర్తి(తూప్రాన్): విధులకు హాజరయ్యేందుకు టూవీలర్‌పై వెళ్తున్న కానిస్టేబుల్‌ను అడవిపంది ఢీకొనడంతో తీవ్రగాయాలైన ఘటన మండల పరిధి దామరంచ గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..శివ్వంపేట గ్రామానికి చెందిన శంకరయ్య హవేలి ఘణపూర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగా విధుల నిమిత్తం హవేలి ఘణపూర్ వెళ్తుతుండగా కుకునూర్ దామరంచ గ్రామాల మధ్యలో సబ్‌స్టేషన్ వద్ద మూలమలుపు చేరుకోగానే అకస్మాత్తుగా అడవిపంది అడ్డురావడంతో టూవీలర్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ శంకరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెనకాలే మరో బైక్‌పై వెళ్తున్న హోంగార్డ్ దీన్ని గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ మదుసూధన్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుణ్ని తన వాహనంలో తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

సిద్దిపేటఅర్బన్: బైక్ చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందగా మరో యువకుడు గాయపడ్డాడు. ఈ ఘటన రాజీవ్ రహదారి మిట్టపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన వానరాశి హరీష్ (22) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రేషన్ కార్డు సవరణ పని నిమిత్తం ఆదివారం మీసేవా కేంద్రానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బంధువు కడమంచి వంశీతో కలిసి బైక్‌పై వెళ్లాడు. రాజీవ్ రహదారి నుంచి మిట్టపల్లి గ్రామం వెళ్లే రోడ్డులో పెద్దమ్మ ఆలయం మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి తాటి చెట్టును ఢీకొట్టింది, దీంతో తలకు తీవ్రగాయాలైన హరీష్ అక్కడికక్కడే మృతి చెందగా, వంశీకి గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో వంశీని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య దీపిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతుడికి ఒక పాప ఉంది.

ముగ్గురి అదృశ్యం



లక్ష్మి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: నిశ్చితార్థం రోజు కిరాణా దుకాణానికి వెళ్లొస్తానని ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన రాములు చిన్న కూతురు లక్ష్మి(22)కి ఈనెల 5వ తేదీన నిశ్చితార్థం ఉండగా, ఉదయం కిరాణా దుకాణానికి సరుకులు తెస్తానని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. తన కూతురు ఇంటి నుంచి వెళ్లేటప్పుడు ఓ వ్యక్తితో ఫోన్ లో మాట్లాడిందని, అతడిపై అనుమానం ఉందని తండ్రి ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్వేత (ఫైల్)

సంగారెడ్డి టౌన్: యువతి అదృశ్యంపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి రూరల్ పోలీల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేటకు చెందిన శ్వేత(21) ఈనెల 9వ తేదీన ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా మేము వివాహం చేసుకున్నామని ఓ వ్యక్తి బదులిచ్చాడు. మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేశారు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బీర్ల బాల్‌రాజ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చిట్కుల్ గ్రామానికి చెందిన బీర్ల బాల్‌రాజ్(27) ఘట్‌కేసర్‌లో మే 6వ తేదీన ఆర్‌ఎస్‌ఎస్ క్యాంపు నిర్వహించాల్సి ఉండగా, బాల్‌రాజ్ గ్రామం నుంచి 4వ తేదీన వెళ్లాడు. 5వ తేదీన క్యాంపు నిర్వాహకులు క్యాంపునకు హాజరైన సభ్యులనుంచి మొబైల్స్ తీసుకున్నారు. 9తేదీ బయటకు వెళ్లాడని, రాత్రయినా తిరిగి బాల్‌రాజ్ క్యాంపునకు రాకపోవడంతో 10వ తేదీ క్యాంపు నిర్వాహకులు చిట్కుల్‌లోని కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. దీంతో బంధువులను, సన్నిహితులను ఆరాతీసినా బాల్‌రాజ్ ఆచూకీ తెలియలేదు. తండ్రి కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ వచ్చాకే కళాకారులకు గౌరవం

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ కవులు, కళాకారులు, సాహితీవేత్తలకు సమాజంలో గౌరవస్థానం ఇస్తూ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహిస్తున్న తెలంగాణ సాహిత్య దినోత్సవం సందర్భంగా మెదక్ పట్టణంలో కవి సమ్మేళనం కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్సీ శేరిసుభాశ్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్లు రమేశ్, ప్రతిమాసింగ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశం గర్వించతగ్గ కవి కోలచాలా మల్లినాథ సూరి స్వస్థలమైన కొల్చారంలో సంస్కృత విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని దేశపతి శ్రీనివాస్, రమణాచారి వంటి వ్యక్తులతో పలుమార్లు ముఖ్యమంత్రిని స్వయంగా కలిసి విజ్ఞప్తి చేయగా అటువంటి గొప్పవ్యక్తికి సముచిత స్థానం కల్పలిస్తానని హామీ ఇచ్చారన్నారు. సునీతా రెడ్డి మాట్లాడుతూ.. 14వ శతాబ్దపు వాడైనా మలినాథ సూరి మన మెదక్ జిల్లా కావడం గర్వకారణమని అన్నారు. ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కవులు, కళాకారులను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి సముచితంగా గౌరవిస్తున్నదన్నారు. అనంతరం కవులను జ్ఞాపిక, ప్రశంసపత్రంతో అతిథులు సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సైదులు, అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డు అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, ఆర్డీఓలు సాయిరామ్, శ్రీనివాసులు, డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, తహసీల్దార్లు చంద్రశేఖర్, శ్రీనివాస్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ముగిసిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్



ఫిష్ ఫుడ్ స్టాల్స్



ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ సందర్భంగా సందడి

- చివరి రోజు భారీగా జనం
- పచ్చళ్లకు ఫుల్ డిమాండ్

సిద్దిపేటజోన్: నోరూరించే చేపల, రొయ్యలతో తయారు చేసిన వంటకాలు.. ఘుమఘుమలాడే వాసన, కుటుంబంతో కలిసి ఆరగించేందుకు వచ్చిన పట్టణవాసులతో కోమటిచెరువు తీరం కళకళలాడింది. జిల్లాలోని గంగపుత్ర సంఘం మహిళా ప్రతినిధులు ప్రత్యేక వంటలను చేసి స్టాల్స్‌లో ఉంచారు. అపోలో ఫిష్, కొరమీను, రవులు, పరకలు, బొచ్చలు, రొయ్యలతో తయారు చేసిన పదార్థాలను మాంసం ప్రియులు ఇష్టంగా ఆరగించారు. ఫిష్ బిర్యానీ, రొయ్యల పులుసు, రొయ్యల పచ్చడి, ఫిష్ ఫింగర్స్, కొరమీను పచ్చడి, చేపల పకోడి, రొయ్యల పకోడి, చేప శనగల ఫ్రై, ప్రాన్స్, కొరమీను కూర, జొన్నరొట్టెలను కొనుగోలు చేశారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడంతో చెరువు పరిసరాలు సందడిగా మారాయి.

ప్రదర్శనతో గుర్తింపు



ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ పేరిట చేపల ఉత్పత్తుల ప్రదర్శన ఇవ్వడం సంతోషాన్ని ఇచ్చింది. ఇలాంటి ప్రదర్శనలతో గుర్తింపు వస్తుంది. నాలుగు రోజుల పాటు అమ్మకాలు చేశాం. ఇంకా కొన్ని రోజులు ఉంటే బాగుండేది.

– వినోద, స్టాల్ నిర్వాహకురాలు, చిన్నకోడూరు

రుచులు బాగున్నాయి



కోమటిచెరువు వద్ద ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం బాగుంది. సాయంత్రం వేళ చెరువు వద్ద ఆహ్లాదకర వాతావరణంలో కొత్త కొత్త రుచులను ఆస్వాదించడం మరిచపోలేని అనుభూతి. ఇలాంటి ఫెస్టివల్స్ తరచుగా జరగాలి.

– సునీత, గృహిణి, సిద్దిపేట

స్పందన వచ్చింది



మంత్రి హరీశ్ రావు ఆదేశాల మేరకు వినూత్న రీతిలో చెరువు వద్ద ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశాం. నాలుగు రోజులుగా ప్రజల్లో మంచి స్పందన వచ్చింది. ఫిష్ ఫుడ్ పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు.

– మల్లేశం, ఫిషరీస్ శాఖ అధికారి